క్లుప్తంగా

నేటి నుంచి ధ్యాన మందిరం దశమ వార్షికోత్సవం

పాత గుంటూరు: కొత్తపేట గణేశ్వరరావు వీధిలో కొలువైవున్న షిరిడి సాయిబాబా ధ్యాన మందిరం దశమ వార్షికోత్సవాలు ఈనెల 15 నుంచి 17 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు వేపూరి లక్ష్మీనరసింహారావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 15న ఉదయం 8 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం, 16న ఉదయం 8 గంటలకు భక్తి సంగీత విభావరి, సాయంత్రం 6గంటలకు లలిత సహస్రనామ పారాయణం, 17న వేకువజామున 5 గంటలకు బాబాకు కాకడ హారతి, పంచామృతాభిషేకాలు, సాయి సత్యవ్రతాలు, అన్న ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కన్నా నాగరాజు కాలనీకి చెందిన షేక్ జానీ(42) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతున్నాడు. సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి ఇంటి సమీపంలోని ఒక ప్రార్థనామందిరంలో నిద్రించాడు. మిత్రులు ఉదయం లేచి చూడగా జాని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అబ్బురపరచిన యక్షగానం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై విశ్వనాథ సాహిత్య అకాడమీ యక్షగాన ఉత్సవాల్లో భాగంగా సోమవారం కర్ణాటక చిక్‌మంగళూరు జిల్లా, కేరమనే గ్రామానికి చెందిన మహాగణపతి యక్షగాన మండలి వారు నిర్వహించిన సీతాపహరణ యక్షగానం ప్రేక్షకులను అలరించింది. ఈ సందర్భంగా అకాడమీ కార్యదర్శి మోదుగుల రవికృష్ణ మాట్లాడుతూ యక్షగాన కళలో సాహిత్యం, సంగీతం, నృత్యం, గానం మిళితమై ఉంటుందని వివరించారు. దక్షిణ భారతంలో గానకళకు అనాది నుంచి విశిష్ట స్థానం ఉందని వివరించారు. ముఖ్య అతిథిగా ఎన్సీఎల్ కంపెనీ సీఈఓ వాసిరెడ్డి విక్రాంత్ పాల్గొని కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత మృతిపై అనుమానాలు.. రీ పోస్ట్‌మార్టం
భర్త, కుటుంబ సభ్యుల అరెస్ట్

గుంటూరు ఈస్ట్: భర్త, అత్తమామలు వేధింపుల కారణంగా వివాహిత అనారోగ్యానికి గురై మృతిచెందిన సంఘటనలో నిందితులను పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవాపురంకు చెందిన వివాహిత మొహమ్మద్ షఫియాబేగం 2020 సెప్టెంబరులో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. అనంతరం ఆమె మృతదేహాన్ని శ్మశానంలో అంత్యక్రియలు చేసి పూడ్చివేశారు. అయితే ఆమె మృతిపై అనుమానం ఉన్న తండ్రి మొహమ్మద్ ఉమర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనేపథ్యంలో పోలీసులు మొహమ్మద్ షఫియాబేగం మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. తదుపరి చర్యల్లో భాగంగా మృతురాలిని వేధించారనే కారణంతో మృతురాలి భర్త సలీముల్లా షరీఫ్, అత్త ఖుర్షీద్‌బేగం, మామ అమానుల్లా షరీఫ్, ఆడబిడ్డ అస్మా, బావ కలీముల్లా షరీఫ్, మరిది ఇబ్రహీం ఖలీలుల్లా షరీఫ్‌లను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

సంప్రదాయ వంటలు సంస్కృతిలో భాగం



గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశంలో సంప్రదాయ వంటల తయారీ విధానమనేది మన సంస్కృతిలో ఒక భాగమని, దానిని విద్యార్థులు కొనసాగించాలని ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇన్‌టాక్) రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో 'ఖానా – ఖజానా' అనే అంశంపై వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ వంటలు మన జాతీయ జీవన విధానం అని, నల భీముల నుంచి ప్రస్తుతం కాలం వరకు మన వంటలు విశిష్ట స్థానాన్ని పొందాయని అన్నారు. ఇన్‌టాక్ సీనియర్ సభ్యుడు పి.రామచంద్ర రాజు మాట్లాడుతూ వివిధ దేశాల్లో మన వంటలు ప్రాచుర్యాన్ని పొందాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై.రతినీచౌదరి, ఇన్‌టాక్ సంస్థ కో–కన్వీనర్ రవి శ్రీనివాస్, సభ్యులు ఎ.రాజశేఖర్, కె.సీతారమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగు కాల్వల సమస్యను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా
- 56వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: నెహ్రూనగర్, తెనాలి రైల్వే ట్రాక్ మధ్యలో ఉన్న ప్రధాన మురుగునీటి కాలువ సమస్యను పరిష్కరిస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. 56వ డివిజన్ నెహ్రూనగర్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. స్థానిక సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే వద్ద ఏకరువు పెట్టారు. నెహ్రూనగర్ ప్రాంతంలో ఎక్కువ భాగం మురుగునీరు పారదలవుతున్న మురుగు కాలువ పూడికతో నిండి ఉంటుందని, కొన్ని ప్రదేశాల్లో ప్రహరీ నిర్మించాలని, ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా రక్షణ కల్పించాలని, డ్రెయిన్‌లను అభివృద్ధి చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్థానికుల విన్నపం మేరకు కాలువను పరిశీలించి రక్షణ నిమిత్తం ప్రహరీ నిర్మిస్తామని, త్వరితగతిన యంత్రాలు ఏర్పాటు చేసి పూడిక తీత పనులు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక చేయూత కలుగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు తోడ్పాటునందిస్తున్నారన్నారు. డెప్యూటీ మేయర్ షేక్ సజిల, కార్పొరేటర్‌లు అయిశెట్టి కనకదుర్గ, అంబేడ్కర్, వంశీబాబు, రవికుమార్, వైఎస్సార్ సీపీ నేతలు శ్రీనివాస్, హుస్సేన్, నాగరాజు, కె.విజయ, శ్రీకాంత్, సుభాష్‌చంద్రబోస్, శృంగారపు శ్రీనివాసరావు, ఉమ, రమేష్, అంజుమన్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ సలాం, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హీరో జూమ్ స్కూటీ



హీరో జూమ్ స్కూటీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముస్తఫా

పాత గుంటూరు: కొత్తపేట యర్రంశెట్టి హీరో షోరూమ్‌లో ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో నూతనంగా హీరో జూమ్ స్కూటీని మంగళవారం మార్కెట్లోకి విడుదల చేసింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా పాల్గొని స్కూటీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హీరో సంస్థ వినియోగదారుల ఆకాంక్షల మేరకు ఆధునిక టెక్నాలజీతో నూతన వాహనాలను ఆవిష్కరించడం శుభపరిణామన్నారు. షోరూమ్ ఎండీ యర్రంశెట్టి శ్రావణ రఘువంశీ మాట్లాడుతూ 110 సీసీ, బ్లూటూత్ కనెక్టివిటీ, రియల్‌టైమ్ మైలేజ్ ఇండికేటర్, బిగ్ టైర్స్, అధిక మైలేజ్, తొమ్మిది సెకన్లలో 60 కిలోమీటర్ల స్పీడ్‌తో వివిధ రంగులలో హీరో జూమ్ స్కూటీ విడుదల చేసినట్లు తెలిపారు. సేల్స్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, సర్వీస్ మేనేజర్ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ మెడలో బంగారు గొలుసును అగంతకులు తెంచుకుని పరారైన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాయత్రినగర్ 2వలైనుకు చెందిన ప్రగడ శాంతి లక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం నిర్వహిస్తున్నారు. మంగళవారం పాఠశాల నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న సమయంలో ఇరువురు అగంతకులు ద్విచక్రవాహనంపై వచ్చి లక్ష్మి మెడలోని ఐదున్నర సవర్ల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శారదాకాలనీకి చెందిన కత్తుల వెంకటేశ్వర్లు (34) కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఇటీవల భార్యతో గొడవ పడడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యానికి బానిసైన వెంకటేశ్వర్లు అస్వస్థతకు గురయ్యాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాడ్‌కు లుంగితో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొరిటెపాడుకు చెందిన చంద్రశేఖరరెడ్డి రేషన్ బియ్యాన్ని మిని లారీలో తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శ్రీనగర్ వద్ద లారీని ఆపి పరిశీలించగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. చంద్రశేఖరరెడ్డిపై కేసు నమోదు చేశారు. రెండున్నర టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

రేపు కూచిపూడి నృత్య రూపకం

పాత గుంటూరు: బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కళా విపంచి ఆధ్వర్యంలో ఈ నెల 16న గోదాకళ్యాణం కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు బొప్పన నరసింహారావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో కళా సంస్థల వ్యవస్థాపకులు గుదిబండి వెంకట రెడ్డి, ఎర్రమల్లి పవన్ కుమార్‌లకు పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

నిపుణత చూపి మరింత వృద్ధి సాధించాలి



ఉద్యోగాలు పొందినవారిని అభినందిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ బి.కరుణ



సినీ దర్శకుడు, రచయిత ఆర్.నారాయణమూర్తిని సన్మానిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచన

ఏఎన్‌యూ: ఉద్యోగం చేసే సంస్థ, వ్యక్తిగత అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేయాలని ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 8వ తేదీన జరిగిన క్యాంపస్ డ్రైవ్‌లో ఇసుజు మోటార్స్ సంస్థ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 136 మంది ఫైనల్ ఇంటర్వ్యూకి అర్హత సాధించారు. వారిలో ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 54 మంది ఉద్యోగాలు సాధించారు. వీరిని మంగళవారం వీసీ అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత ఉన్నత ఉపాధి అవకాశాలు సాధించే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య, డీన్ ఆచార్య ఇ.శ్రీనివాసరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ తౌసీఫ్, అధ్యాపకులు డాక్టర్ ఎం.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు..

ఏఎన్‌యూ: నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి అన్నారు. యూనివర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'వయొలెన్స్: యాన్ ఇంపిడిమెంట్ టూ ఉమెన్ ఎంపవర్‌మెంట్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య స్వరూపరాణి ప్రసంగిస్తూ మహిళలను ఇబ్బందులకు గురి చేసే వారిని చట్టబద్ధంగా కఠినంగా శిక్షించాలన్నారు. బాధితులకు నష్టపరిహారంగా డబ్బులు ఇవ్వడం ఒక్కడే పరిష్కారమార్గం కాదన్నారు. సదస్సులో పరిశోధనా పత్రాలు మర్పించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ కేవీ శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూని సందర్శించిన ఆర్.నారాయణ మూర్తి..

ఏఎన్‌యూ: సినీ దర్శకుడు, రచయిత, నటుడు ఆర్.నారాయణమూర్తి మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తాను యూనివర్సిటీ అనే సినిమాను తీశానని దానిలో ప్రొఫెసర్ పాత్ర వేశానని నారాయణమూర్తి వీసీకి తెలిపారు. ఆ సినిమా పాటలను వచ్చే నెలలో ఏఎన్‌యూలో విడుదల చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ, కళారంగాలకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు కొద్దిసేపు చర్చించారు. నారాయణమూర్తిని వీసీ సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీతి, నిజాయతీకి నిలువుటద్దం.. తనబుద్దు కృష్ణారెడ్డి

- పార్థివ దేహానికి ఘన నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ నేతలు
- జన సందోహం మధ్య అంతిమయాత్ర



గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీకి వీరాభిమాని తనబుద్దు కృష్ణారెడ్డి(54) నీతి నిజాయితీకి నిలువుటద్దం అని వైఎస్సార్ సీపీ నేతలు మంగళవారం నివాళులర్పించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ 48వ డివిజన్ కార్పొరేటర్ కృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఆమె భర్త దయాసాగర్ రెడ్డిపాలెం గ్రామంలోని కృష్ణారెడ్డి ఇంటికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తాఫా, మద్దాళిగిరి, ఉండవల్లి శ్రీదేవి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, గుంటూరు పార్లమెంట్ జిల్లా ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి, డిప్యూటీ మేయర్లు డైమండ్ బాబు, షేక్ సజిల, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తదితరులు కృష్ణారెడ్డి పార్థివ దేహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. పార్టీ జెండాను కృష్ణారెడ్డి పార్థివ దేహానికి కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఆయన 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని నాయకుడన్నారు. వార్డ్ మెంబర్‌గా, ఉప సర్పంచ్, సర్పంచ్‌గా కృష్ణారెడ్డి గ్రామానికి చేసిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎనలేనివని కొనియాడారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన ఏకైక కార్పొరేటర్ అని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కృష్ణారెడ్డి అకాల మృత్యువాతకు గురికావడంతో.. జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామానికి చేరుకున్నారు.



కృష్ణారెడ్డి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



పార్థివ దేహానికి వైఎస్సార్ సీపీ జెండా కప్పుతున్న లేళ్ల అప్పిరెడ్డి, మోదుగుల వేణుగోపాలరెడ్డి



అంతిమయాత్రకు హాజరైన అభిమాన జనం

మంత్రి ధర్మాన సంతాపం..

కృష్ణారెడ్డి మృతికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణారెడ్డి అకాల మృతి ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. నీతి నిజాయితీలకు మారుపేరుగా కృష్ణారెడ్డి ఎంతో రాణించాడన్నారు. ఆయన అకాల మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కృష్ణారెడ్డి కుటుంబానికి ప్రగాడ సానుభూతిని తెలిపారు.

దామోదరం సంజీవయ్య ఆదర్శనీయుడు



దామోదర సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: తొలితరం ముఖ్యమంత్రులలో నీతి నిజాయితీకి కట్టుబడి రాష్ట్ర ప్రజలకు తన వంతు సేవ చేసిన మహానుభావుడు దామోదరం సంజీవయ్య అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. మంగళవారం అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య 102వ జయంతి సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అనుసరించి ఆనాడు ఉన్నటువంటి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ తన పాలన విధానాన్ని ఎంతో నైపుణ్యంగా నిర్వహించారన్నారు. చిన్ననాటి నుంచే విద్యావంతుడుగా తన జీవితాన్ని కొనసాగిస్తూ, యువ నాయకుడిగా అనేక ఉద్యమాల్లో పాల్గొంటున్న క్రమంలో ఆనాడు కాంగ్రెస్ పెద్దలు దామోదర సంజీవయ్య చురుకుదనాన్ని కమిట్మెంట్‌ను చూసి ముఖ్యమంత్రిగా చేయటం జరిగిందన్నారు. ఆనాటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా దళిత బహుజన అణగారిన కులాలకు భూములు పంచిన ఘనత సంజీవయ్యకే దక్కుతుందన్నారు.

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న సదాశివరావు

గుంటూరు మెడికల్: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు తుళ్లూరు మండలం తాళాయపాలెం శైవక్షేత్రంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మదీక్ష సేవక్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇక్కుర్తి సదాశివరావు చెప్పారు. నగరంపాలెంలోని కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజరాజేశ్వరీ దేవి సమేత కోటిలింగేశ్వర స్వామివార్ల మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 15న ప్రారంభమై, 17వ తేదీన ఆత్మలింగ ప్రతిష్ట, సువర్ణ లింగ ప్రతిష్ట, కోటి రుద్రాక్ష లింగ ప్రతిష్ట జరుగుతోందన్నారు. 18న లింగోద్భవ సమయంలో అభిషేకాలు, శివపార్వతుల కల్యాణ మహోత్సవం, 19వ తేదీ దివ్య రథోత్సవం ఊంజల సేవ వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈసమావేశంలో హిందూ ధర్మదీక్ష సేవక్ నగర అధ్యక్షుడు ఎడమ రాజేష్, నగర ధర్మ ప్రచారక్ ఊరుబండి కృష్ణమూర్తి, ముప్పా బుజ్జమ్మ, సింగంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ హాలుకు అంబేడ్కర్ పేరు పెట్టాలి



మేయర్ కావటి మనోహర్ నాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆధునికీకరిస్తున్న కౌన్సిల్ కౌన్సిల్ హాలుకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పేరు పెట్టాలని ది ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుబాబు నగర మేయర్ కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం చాంబర్‌లో మేయర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గం సమావేశాలు జరుపుకొనే సాదారణ సమావేశ మందిర (కౌన్సిల్ హాల్) నకు పేద, పీడిత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి భారతదేశ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని రానున్న కౌన్సిల్ సమావేశంలో చర్చకు తీసుకువచ్చి ఆమోదింపజేయాలని కోరారు.

ఘనంగా తులసీ ధర్మచరణ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న తులసి ధర్మచరణ్

కొరిటెపాడు(గుంటూరు): వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, సన్నిహితులు గుంటూరు నగరంలో మంగళవారం నిర్వహించారు. బ్రాడీపేటలోని షిరిడీ సాయి సేవా సమితిలో చిన్నారుల సమక్షంలో అల్లు సేవా సమితి ఆధ్వర్యంలో సభ్యులు కేక్ కట్ చేసి, అన్నదానం నిర్వహించారు. అల్లు సేవా సమితి సభ్యుడు రాజేటి రామకృష్ణ పాల్గొన్నారు. తులసి ధర్మచరణ్ సన్నిహితులు అన్నదాసు వెంకట సుబ్బారావు, డొంకేన మురళీకృష్ణ ఆధ్వర్యంలో రెడ్డిపాలెంలోని మానవతా సేవా సమితి వయో వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. తనపై చూపుతున్న ప్రేమానురాగాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తులసి ధర్మచరణ్ తెలిపారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో బండి దుర్గ, బండారు రవీంద్ర, అల్లు సేవా సమితి సభ్యులు మార్కెట్ శివ, శ్రీను, సాయి, తోట రంగారావు, డాక్టర్ కంతా జగదీష్, కన్నెగంటి బాలు, నీలం శివరామకృష్ణ, చందు, గణేష్, కన్నసాని బాజి, దంతాల అనిల్, వేద సీడ్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలు అమూల్యకు సన్మానం



అమూల్య, కృష్ణ స్రవంత్ దంపతులను సన్మానిస్తున్న శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం సభ్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు ఆదిత్య మల్టీస్పెషాలిటీ హాస్పటల్ అధినేత, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కృష్ణ స్రవంత్ సతీమణి డాక్టర్ చదలవాడ అమూల్య సూపర్ స్పెషాలిటీ పీజీ న్యూరాలజీలో గోల్డ్ మెడల్ సాధించినందుకు మంగళవారం శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆమెకు ఘన సన్మానం జరిగింది. స్థానిక గుంటూరువారితోటలోని హాస్పటల్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ డాక్టర్ అమూల్య మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పాకనాటి రమాదేవి, యోగ గురూజీ ఆళ్ల రాజేశ్వరరావు, గుంటూరు జిల్లా జనసేన అధికారప్రతినిధి ఆళ్ల హరి, మిరియాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి కృషి చేయాలి



మంత్రి నాగార్జునకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గుంటూరు రూరల్: నగరంలోని ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరిందని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని పలు ప్రజా సంఘాల నేతలు రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు మంగళవారం నగర శివారులోని ఆయన క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి నాగార్జున ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి భవన నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. భీమ్‌భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ళ ప్రకాష్, పలు ప్రజాసంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, తాడికొండ నరసింహారావు, జొన్నలగడ్డ శ్రీకాంత్, బడికొళ విజయ్‌భాస్కర్, రావినూతల కమలకుమారి, షేక్ బాజీ, ఎర్రగుంట్ల సుజాతరావు, బంట్లమూడి స్టాలిన్ తదితరులున్నారు.

దుకాణం దగ్ధం చేసిన వ్యక్తిపై కేసు

పట్నంబజారు: ఫ్యాన్సీ దుకాణాన్ని తగులబెట్టిన వ్యక్తిపై కేసు నమోదు అయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబా కాలనీలో నివాసం ఉండే రెడ్డి లీలావతి ఇంటి పక్కనే ఒక ఫ్యాన్సీ దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. లీలావతి కుమార్తె జ్యోతికి గత ఏడాది రాజా అనే వ్యక్తితో వివాహం జరిపించగా, స్వల్ప వివాదాల నేపథ్యంలో కుమార్తె ఆమె ఉంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో అల్లుడు రాజా సోమవారం రాత్రి పెట్రోల్ పోసి లీలావతి దుకాణాన్ని తగులబెట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జీడీసీసీబీ మహాజన సభ సమావేశం

కొరిటెపాడు: గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీబీ) మహాజన సభ సమావేశం బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు అధ్యక్షతన బ్రాడీపేటలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బుధవారం జరుగుతోందని బ్యాంకు సీఈఓ టి.కృష్ణవేణి మంగళవారం తెలిపారు.

